సాక్షి అనకాపల్లి

బుధవారం, 25, సెప్టెంబర్, 2024



రైవాడ.. నిండు కుండ 8లో

రైవాడ జలాశయం నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. నేడో, రేపో స్పిల్‌వే గేట్ల ద్వారా నీటి విడుదలకు అవకాశముంది.



విముక్తి కలిగించండి 8లో

సారా నుంచి తమ గ్రామానికి విముక్తి కలిగించాలని నాతవరం మండలం సుందరకోట గ్రామస్తులు ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు.



బాక్సింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : ఆల్ ఇండియా అంతర రైల్వేస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం ప్రారంభించారు.

'కూటమి' రచ్చరచ్చ



మేయర్ రాజీనామా చేయాలంటూ పోడియం ముందు బైఠాయించిన కూటమి కార్పొరేటర్లు

- జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం రసాభాస
- అసలు అజెండాను పక్కనపెట్టి సొంత స్క్రిప్ట్‌తో వచ్చిన కూటమి కార్పొరేటర్లు
- జీరో అవర్ పేరుతో కాలయాపన
- స్థానిక సమస్యలను పక్కనపెట్టి వాగ్వాదం
- మేయర్ రాజీనామా చెయ్యాలంటూ పోడియం ముందు బైఠాయింపు
- అజెండాలోని 75 అంశాలపై చర్చకు అవకాశమివ్వాలంటూ మేయర్ విజ్ఞప్తి
- ఆరోపణలపై విచారణ జరిపిస్తామని చెప్పినా పట్టించుకోని కూటమి సభ్యులు
- ఒక్క అంశంపైనా చర్చకు తావివ్వకుండా రాద్ధాంతం
- కౌన్సిల్ సమావేశాన్ని నేటికి వాయిదా వేసిన మేయర్

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పట్టింపులేదు. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి లేదు. నగరాభివృద్ధి ధ్యాసే లేదు. అర్జెంట్‌గా మేయర్ సీటును దక్కించుకోవడమే ప్రధాన అజెండాగా కూటమి కార్పొరేటర్లు సర్వసభ్య సమావేశంలో రెచ్చిపోయారు. స్థానిక సమస్యలపై చర్చించాలని జీరో అవర్ అడిగిన టీడీపీ కార్పొరేటర్లు.. వాటిని ప్రస్తావించకుండా స్కూల్‌లో చిన్నపిల్లల్లా వాదులాడుకున్నారు. అజెండాలో అంశాలను పక్కనపెట్టి.. సొంత అజెండాతో సమావేశానికి వచ్చి.. చర్చ జరగకుండా రచ్చరచ్చ చేశారు. ఇలా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఒక్క అంశంపై కూడా చర్చించే అవకాశం లేకుండా రసాభాసగా ముగిసింది. సమావేశం బుధవారానికి వాయిదా పడింది. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు.

ముందుగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణానికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం తొలిసారిగా ఎన్నికై ఎక్స్‌అఫీషియో హోదాలో కౌన్సిల్ సమావేశానికి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబులను మేయర్ సన్మానించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

సమావేశం నేటికి వాయిదా

మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారానికి వాయిదా వేసినట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చెప్పారు.

'స్టీల్‌ప్లాంట్'పై తీర్మానానికి టీడీపీ ససేమిరా



సేవ్ స్టీల్‌ప్లాంట్ ప్లకార్డుతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బర్కత్ అలీ

సేవ్ స్టీల్‌ప్లాంట్ పేరుతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ప్లకార్డులతో నినాదాలు చేశారు. దీనిపై సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు స్టాలిన్, గంగారావులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని సెయిల్‌లో విలీనం చేసే అంశంపై ముఖ్యమంత్రి ద్వారా కేంద్రం పెద్దలను కలిసే ప్రయత్నం చేయాలని సూచించారు. ఆ అంశాన్ని టేబుల్ అజెండాలో చేర్చేలా రూలింగ్ ఇవ్వాలని కోరగా.. అందుకు మేయర్ అంగీకరించి అధికారులను ఆదేశిస్తున్న తరుణంలో టీడీపీ కార్పొరేటర్లు అడ్డు తగిలారు. స్టీల్‌ప్లాంట్‌పై తీర్మానం చేయడం ఇష్టం లేని టీడీపీ కార్పొరేటర్లు అందుకు ససేమిరా అన్నారు. గతంలోనే ఒకసారి తీర్మానం చేసి పంపించడం జరిగిందని, మళ్లీ ఎందుకని ప్రశ్నించారు. మొత్తానికి స్టీల్‌ప్లాంట్‌పై తీర్మానం చేయకుండానే చర్చను పక్కదారి పట్టించారు. విశాఖ నగరంలో వీధి దీపాల విషయంలో మాత్రం కౌన్సిల్‌లో సభ్యులందరూ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మేయర్ హరి వెంకట కుమారి జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను ఆదేశించారు. నైట్ ఫుడ్ కోర్టులో అనుమతించిన దుకాణాల కంటే ఎక్కువ ఉన్నాయని డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్ ప్రస్తావించడంతో నిజమైన లబ్ధిదారులను గుర్తించి మిగతా వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని మేయర్ ఆదేశించారు.



సమావేశానికి హాజరైన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, రవీంద్రబాబు, వరుదు కల్యాణి

ఇష్టానుసారం ఆరోపణలు..

పారిశుధ్య కార్మికులకు సంబంధించిన టీడీఎస్ సొమ్మును అధికారులు కాజేశారని టీడీపీ కార్పొరేటర్లు ఆరోపించారు. కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బును అధికారులు సొంతానికి వాడుకున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు చెప్పినా సాకులు చెబుతున్నారని చెప్పారు. దీనిపై మేయర్ స్పందిస్తూ.. వెంటనే విచారణ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. పొదుపు సంఘాలు, మహిళా మార్టులు.. ఇలా పలు సంఘాల ద్వారా మొత్తంగా రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందని చెప్పారు. ఇందులో అప్పటి కమిషనర్, మేయర్ హస్తం కూడా ఉందని ఆరోపించారు. దీనిపై మేయర్ విచారణ చేయాలని కమిషనర్‌ను ఆదేశించగా.. టీడీపీ కార్పొరేటర్లు అడ్డు తగిలారు. ఆరోపణలు ఉన్న మేయర్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనేక ఆరోపణలు ఉన్నాయని, ఆయన రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించడంతో.. టీడీపీ కార్పొరేటర్లు నీళ్లు నమిలారు. ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పలేక.. మేయర్ రాజీనామా చేయాలని ఆమె పోడియం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అభియోగాలు మోపి రాజీనామా చేయమనడం సమంజసం కాదని మేయర్ పేర్కొన్నారు. అయినప్పటికీ కూటమి కార్పొరేటర్లు పోడియం ముందు బైఠాయించారు. దీంతో మేయర్ 10 నిమిషాల పాటు సభను వాయిదా వేశారు. మళ్లీ మధ్యాహ్నం 1.30కి సభను ప్రారంభించగా.. మళ్లీ కూటమి కార్పొరేటర్లు సభ జరగడానికి అంగీకరించలేదు. దీంతో మేయర్ గంట పాటు లంచ్ బ్రేక్ ఇచ్చారు. మధ్యాహ్నం 2.30కి సభకు వచ్చినప్పటికీ.. వారి పరిస్థితిలో మార్పు లేదు. దీనిపై మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనను రాజీనామా చేయమని చెప్పే హక్కు లేదని స్పష్టం చేశారు. టీడీపీ కార్పొరేటర్లందరిపై ఆరోపణలు ఉన్నాయని, అందరూ రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. దీనిపై అధికారులు సమాధానమిస్తూ మేయర్, అప్పటి కమిషనర్‌పై వచ్చిన ఆరోపణలపై విచారించే అధికారం కలెక్టర్‌కు ఉందని, ఆయనకు లేఖ రాస్తామని చెప్పినప్పటికీ.. కూటమి కార్పొరేటర్లు నినాదాలను ఆపలేదు. సభ జరిగే పరిస్థితి లేకపోవడంతో మేయర్ కౌన్సిల్‌ను బుధవారం ఉదయానికి వాయిదా వేశారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ఎక్స్ అఫీషియో సభ్యులు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నోరు పారేసుకున్న జనసేన కార్పొరేటర్

అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేసిన టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, దళిత డాక్టర్‌పై దాడి చేసిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 100 రోజుల్లో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జనసేన కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి రెచ్చిపోయారు. బయటకు వెళ్లి ధర్నా చేసే ధైర్యం లేక సభలో చేస్తున్నారా? వీరికి నా కొడకల్లారా.. అంటూ నోరు పారేసుకున్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ కార్పొరేటర్ల వద్ద ఉన్న మైక్‌ను లాక్కోడానికి తెగ ప్రయత్నించారు. ఒకవైపు టీడీపీ కార్పొరేటర్లు సైతం వారిని వారించడానికి ప్రయత్నించినప్పటికీ ఆమె ఆగలేదు. మైక్ లాక్కొని వెళ్లిపోయారు.



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో వాగ్వాదం చేస్తున్న జనసేన కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయిలో పాఠశాల, జూనియర్ కాలేజీల క్రీడాపోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ దేముడు బాబు తెలిపారు. గురువారం అండర్ -14, అండర్ -17 బాలబాలికల అథ్లెటిక్స్ ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో, రెజ్లింగ్ పోటీలు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కొయ్యూరు జీటీడబ్ల్యూఎస్ (బాలురు) పాఠశాలలో జరుగుతాయన్నారు. 27న ఆనందపురం కేకేఆర్ గౌతమ్ స్కూల్ క్రీడా మైదానంలో అండర్ -17 బాలబాలికల మోడరన్ పెంటాథిలిన్ పోటీలు ఉంటాయన్నారు. 28న అండర్ -14, అండర్-17 స్విమ్మింగ్ పోటీలు రైల్వే స్టేడియం ఆర్‌ఆర్ ఆక్వాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 30న అండర్ -17 నెట్‌బాల్ జెడ్పీహెచ్‌ఎస్ కణితిలో నిర్వహిస్తామన్నారు.

'జూడో'లో విద్యార్థుల ప్రతిభ



సాధించిన మెడల్స్‌తో విద్యార్థులు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు సత్తాచాటినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు బాబు మంగళవారం తెలిపారు. అండర్ -14 బాలికల విభాగంలో బత్తిన పద్మ ప్రియాంక (జెడ్పీహెచ్‌ఎస్, పాయకరావుపేట) సిల్వర్ మెడల్ సాధించింది. సమ్మంగి భాగ్యశ్రీ (శొంఠ్యాం, వెంకట విద్యాపీఠ్) కాంస్య పతకం కైవసం చేసుకుంది. అండర్-14 బాలుర విభాగంలో షేక్ సమీర్ ఖాన్(శొంఠ్యాం, వెంకట విద్యాపీఠ్) కాంస్య పతకం, గోడ చరణి (జెడ్పీహెచ్‌ఎస్, వడ్డాది) సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని విశాఖ, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారులు చంద్రకళ, వెంకటలక్ష్మమ్మ అభినందించారు. టీమ్ కోచ్‌గా ఎల్.అప్పలరామ్, మేనేజర్‌గా ఎస్కే బేబీ వ్యవహరించారు.

పలు ఆలయాల ఈవోల బదిలీ

మహారాణిపేట (విశాఖ): దేవదాయ శాఖలో పలువురు ఈవోలను బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. చోడవరం గ్రూప్ ఆలయాల ఈవో ఎస్.వి.వి.సత్యనారాయణమూర్తిని కశింకోట ఆలయాల గ్రూప్ ఈవోగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో కీర్తి శ్రీనివాసరావును మెయిన్‌రోడ్డు శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం గ్రూప్ ఈవోగా నియమించారు. బి.వి.ఎస్.ఎస్.ఎం.కృష్ణను అనకాపల్లి శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ గ్రూపు ఈవోగా, టి.సాంబశివరావును నర్సీపట్నం గ్రూప్ ఆలయాల ఈవోగా నియమించారు.

సరళంగా.. సులభంగా..

- విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి
- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

నర్సీపట్నం: విద్యార్థులకు సులభంగా బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఉపాధ్యాయులకు సూచించారు. డివిజనల్ స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నర్సీపట్నం జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ 3, 4, 5 తరగతుల విద్యార్థులకు గణితాన్ని అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ప్రాథమిక విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా బోధన కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసుకుని తదనుగుణంగా బోధన కొనసాగించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 12 మండలాలకు చెందిన ఎంఈవోలు, సమగ్ర శిక్ష ఏఎంఓ నిఖిత, రిసోర్స్ పర్సన్స్ కెజియా, సీఆర్‌పీలు పూడి వెంకట్రావు, లోకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు పోరాట కమిటీ

- 2, 3 ,4 తేదీల్లో నిరాహార దీక్షలు

తుమ్మపాల: విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాట కమిటీ ఏర్పాటు జరిగిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయు, ఏఐటీయూసీ, రైతు సంఘం, ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, డీవైఎఫ్‌ఐ, రైతు స్వరాజ్య వేదిక, ఏఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీ జిల్లా కన్వీనర్‌గా ఆర్.శంకరరావు, కో కన్వీనర్‌గా ఆర్.దొరబాబు, కమిటీ సభ్యులుగా కర్రి అప్పారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, ఎం.రమణ, డీడీ వరలక్ష్మి, పి.మాణిక్యం, జి.కోటేశ్వరరావు, కె.శంకరరావు నియమితులయ్యారు.



పోరాట కమిటీ సభ్యుల సంఘీభావం

రాష్ట్రపతి నుంచి నాతవరం ఎంపీపీకి ఆహ్వానం

- 26న ద్రౌపది ముర్మును కలిసే అవకాశం
- గిరిజన గ్రామాలు విలీనం చేయాలని విజ్ఞప్తి చేస్తా : ఎంపీపీ సాగిన



గిరిజన సర్పంచులు, పెద్దలతో సమావేశమైన ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే అవకాశం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తికి వచ్చింది. ఎంపీపీ సాగినతోపాటు సరుగుడు, సుందరకోట, మాధవనగరం, కె.వి.శరభవరం, చమ్మచింత పంచాయతీ సర్పంచులకు ఢిల్లీ నుంచి మూడు రోజుల క్రితం ఆహ్వానం అందింది. వారంతా ఢిల్లీ వెళ్లేందుకు మండల పరిషత్ అధికారులు విమానం టికెట్లు తీసి, ప్రయాణ ఏర్పాట్లు చేశారు. బుధవారం విశాఖలో బయలుదేరి సాయంత్రానికి ఢిల్లీ చేరుకుని, గురువారం రాష్ట్రపతిని కలవనున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ మంగళవారం తన కార్యాలయంలో గిరిజన సర్పంచులు, 1/70 యాక్టు పరిధిలో ఉన్న గిరిజన పెద్దలతో సమావేశమయ్యారు. మైదాన ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలను పాడేరు ఐటీడీఏ పరిధి కొయ్యూరు మండలంలో విలీనం చేయాలని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ తెలిపారు. గిరిజన ప్రాంతాల సమస్యలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముందుగా తనను ఎంపీపీని చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాతవరం మండలంలో 1/70 యాక్టు పరిధిలో ఉన్న గిరిజన పంచాయతీలైన సరుగుడు, సుందరకోట, కె.వి.శరభవరంలను కొయ్యూరు మండలంలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేస్తానన్నారు. ఈ మూడు పంచాయతీలకు సంబంధించి జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల ఆమోదిస్తూ తీర్మానాలు గతంలో చేశారని గుర్తు చేశారు. ఆ తీర్మానాల కాపీలను రాష్ట్రపతికి అందిస్తామన్నారు. మైదాన ప్రాంతంలో ఉన్న గిరిజన పంచాయతీలను విలీనం చేయడం ద్వారా ఐటీడీఏ ప్రయోజనాలతో పాటు తమ పిల్లలు భవిష్యత్తు బాగుంటుందన్నారు. మండలాలు విభజన కాకముందు సమితుల సమయంలో ఆయా పంచాయతీలు పాడేరు ఐటీడీఏ పరిధిలోనే ఉండేవన్నారు.

ఇది కదా దార్శనికత..!

పాడి రైతులు కలలో కూడా ఊహించలేదు నియోజకవర్గానికో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం వస్తుందని.. గతంలో పశువులకు ఏ రోగం వచ్చినా పరీక్షల కోసం నమూనాలను విశాఖ తీసుకువెళ్లాల్సి వచ్చేది. ఫలితాలు వచ్చి వైద్యుడు మందు ఇచ్చి స్వస్థత చేకూరే లోపే పుణ్య కాలం గడిచిపోయేది. అలా నష్టపోయిన రైతులెందరో! ఇప్పుడు.. వారి చెంతకే ఒక లేబొరేటరీ వచ్చింది. అక్కడి పరీక్ష ఫలితాలను బట్టి తక్షణమే వైద్య సేవలు అందుతున్నాయి. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాడి పరిశ్రమకు చేసిన మేలు ఇంతా అంతా కాదు.

ఆనాటి ముందుచూపుతో నేడు సత్ఫలితాలు

- పాడి రైతుకు అండగా పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు
- గత ప్రభుత్వంలో జిల్లాలో 7 లేబొరేటరీల ఏర్పాటు
- నియోజకవర్గ కేంద్రాల్లోనే అన్ని రకాల పరీక్షలు
- వ్యాధి నిర్ధారణతో పశువులకు సకాలంలో వైద్యం
- ఇప్పటి వరకు జిల్లాలో 22,789 శాంపిల్స్ సేకరణ



నర్సీపట్నంలో పశువ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రం



పశువ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: పాడి పరిశ్రమ అభివృద్ధికి నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు నేడు సత్ఫలితాలను ఇస్తున్నాయి. వ్యవసాయ, పాడి రైతుల శ్రేయస్సు, ఆయా రంగాలను అభివృద్ధి చేయాలనే ముందుచూపుతో గత ఐదేళ్లలో తీసుకున్న చర్యలతో.. నేడు పాడి రైతులకు మేలు చేకూరుతోంది. పశువులు అనారోగ్యం బారిన పడి పరిస్థితి విషమంగా మారితే.. వాటి పరీక్షల కోసం విశాఖకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఆ పరిస్థితి లేకుండా అనకాపల్లి జిల్లాలోనే నియోజకవర్గానికొక పశు వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 7 సెంటర్లు ఏర్పాటు చేశారు. అగ్రి ల్యాబ్‌లకు అనుబంధంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో నర్సీపట్నం, చోడవరం, సబ్బవరం, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, మాడుగులలో ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా పశువులకు వైద్యసేవలందిస్తున్నారు. వైఎస్ జగన్ సర్కార్ 2023లో ఏర్పాటు చేసినప్పటి నుంచి నేటి వరకు ఏడాది కాలంలో 22,789 శాంపిల్స్ సేకరించారు. ఆధునిక పరికరాలతో పశువుల మూత్రం, పేడ, రక్తం, పాలు, చర్మాలను పరీక్షిస్తున్నారు. ఒక ల్యాబ్ టెక్నీషియన్, అసిస్టెంట్ టెక్నీషియన్, అటెండరుతో పనిచేసే ఈ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయానికి అనుబంధంగా కార్యకలాపాలు నిర్వహిస్తాయి.

ఉచితంగానే పరీక్షలు..

వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు అందుబాటులోకి రావడంతో పాడి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పశువుల ఆరోగ్యం చెడిపోతే ఎన్నో అవస్థలు పడేవారు. పశువులకు ఎంత పెద్ద రోగం వచ్చినా స్థానిక వైద్యులతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. విశాఖ వెళ్లి పరీక్షలు చేయించుకోవడం, రిపోర్టు వచ్చాక వైద్యుల వద్దకు పరిగెత్తడం ఎంతో భారంగా ఉండేది. ఇప్పుడు ఎక్కడికక్కడ లేబొరేటరీల ఏర్పాటుతో పాడి రైతులు పైసా ఖర్చు లేకుండా పశువులకు పరీక్షలు చేయించి, సకాలంలో వైద్య సేవలు పొందగలుగుతున్నారు. అధికారులు ఏడాది కాలంలో క్షేత్రస్థాయిలో 34 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ ధ్రువీకరించిన తర్వాత రైతు భరోసా కేంద్రాలు, ల్యాబ్‌లకు అనుసంధానం చేస్తూ రూపొందించిన యాప్‌లో పరీక్షల ఫలితాలను అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని రైతు భరోసా కేంద్రాల వెటర్నరీ అసిస్టెంట్లు పరిశీలించి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేస్తున్నారు.

జిల్లాలో పశు సంపద..
పశువులు 4.25 లక్షలు
గొర్రెలు 1.61 లక్షలు
మేకలు 1.81 లక్షలు
పందులు 4 వేలు
కోళ్లు 33.66 లక్షలు

లక్ష్యాన్ని అధిగమించి..
2023-24లో నమూనాల సేకరణ లక్ష్యం 20 వేలు
సేకరించిన శాంపిల్స్ 22,789
పశువుల మూత్ర పరీక్షలు 250
పేడ పరీక్షలు 10,563
నులి పురుగుల నివారణ పరీక్షలు 3,420
రక్త పరీక్షలు 3,728
చర్మవ్యాధి పరీక్షలు 310
పెథాలజీ బయో కెమికల్ పరీక్షలు 134
పాల పరీక్షలు 656

ల్యాబ్‌లో అక్విప్‌మెంట్.. వాటి వినియోగం

మైక్రోస్కోప్: రక్తం, పేడ పరీక్షలు నిర్వహించేటప్పుడు సూక్ష్మ కణాలను గుర్తించేందుకు వినియోగిస్తారు

సెంట్రిఫ్యూజ్: రక్తంలో సీరం, ప్లాస్మా వేరు చేయడానికి ఉపయోగిస్తారు.

బయోకెమికల్ ఎనలైజర్: దీంతో సీరం సంబంధిత కిడ్నీ, లివర్, సుగర్ వ్యాధి పరీక్షలు చేస్తారు.

ఇంక్యుబేటర్: పశువుల వ్యాధి నిర్ధారణకు సేకరించిన శాంపిల్స్‌ను బ్యాక్టీరియా సోకకుండా దీంట్లో ఉంచుతారు

ఆటోక్లేవ్: వీటితో పరికరాలను వేడి నీటితో శుభ్రం చేస్తారు.

లేబొరేటరీ సేవలు వినియోగించుకోవాలి



లేబొరేటరీలు ఏర్పాటు కాకముందు శాంపిల్స్‌ను వ్యాధి నిర్ధారణ పరీక్షకు విశాఖపట్నం పంపించాల్సి వచ్చేది. ఫలితాల కోసం చాలాకాలం వేచి చూడాల్సి వచ్చేది. వ్యాధి నిర్ధారణ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో సకాలంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలు రైతుకు అందజేసి, వెంటనే వైద్య సేవలు అందిస్తున్నాం. ఏ ఒక్క పశువు మరణించకుండా సకాలంలో వైద్యం అందించి కాపాడుతున్నాం. చాలామంది రైతులు లేబొరేటరీలను వినియోగించుకుంటున్నారు. ఇది మరింతగా పెరగాలి.

– బి.రామ్మోహన్‌రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

పర్మినెంట్ చేయాలని కోరుతూ 30న కార్మికుల ధర్నా



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఈ నెల 30న అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ధర్నా గోడపత్రికలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత లేదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం నేటికీ అమలు కాలేదని వాపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ వర్కర్లను పర్మినెంట్ చేసి మంచి ప్రభుత్వమని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏడో జోన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, యూనియన్ అధ్యక్షుడు అజయ్, సభ్యులు నూకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసులు దాడులు



సీఐ రేవతమ్మ సమక్షంలో బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలెం గ్రామ శివారులో సారా బట్టీలపై సీఐ రేవతమ్మ, ఎస్సై రమేష్, సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన మూడు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీలను నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరించి వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేవీ వచ్చింది.. పొట్ట కొట్టింది

తరతరాలుగా వారికవే జీవనాధారం.. పచ్చని భూముల్లో పండే సిరిసంపదలు.. కూలీ లేకపోయినా అండగా ఉండే కొండలు.. పశుగ్రాసం, వంటచెరకు, కలప, గ్రావెల్ వంటి సంపదతో హాయిగా బతికేవారు. ఇప్పుడవే కోల్పోవడంతో ఒక్కసారి వారి బతుకు తలకిందులైంది. ఉన్నపళంగా ఉపద్రవం ముంచుకొచ్చినట్టుగా నేవల్ బేస్ ప్రాజెక్టు రావడంతో సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారారు. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపలేదు. పునరావాసం కల్పించకపోగా ప్యాకేజీ ఇచ్చిన పాపాన పోలేదు. వీటి కోసం వివిధ రూపాల్లో శాంతియుత నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రాలేదు.



శారదానదిని ఆనుకుని నిర్మించిన నేవీ ప్రహరీ



పెదకలవలాపల్లిలో రామాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

- రాంబిల్లిలో చురుగ్గా నేవల్ బేస్ నిర్మాణం
- జీవనాధారం కోల్పోయిన 5 గ్రామాలు
- నిర్వాసితులకు ఉపాధి కల్పించని ప్రభుత్వం
- ప్రకటనలకే ప్యాకేజీ పరిమితం

రాంబిల్లి (యలమంచిలి): నేవల్ బేస్ ప్రాజెక్ట్ వచ్చి ఐదు గ్రామాలకు ఉపాధి లేకుండా చేసింది. భూములు, చెట్లు, పుట్టలు, గట్లు కోల్పోయి నిర్వాసితులకు పూట గడవటం ప్రశ్నార్థకంగా మారింది. జీవనాధారమైన కొండలను సైతం నేవీ అధికారులు స్వాధీనం చేసుకుని ఆయా గ్రామాల చుట్టూ దారులు మూసి ప్రహరీ నిర్మించడం వల్ల వారు బతుకులు ఛిన్నాభిన్నమయ్యాయి. తమ సమస్యలుపై నిరసనలు, ధర్నాలు చేపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్లిపోతున్నారే తప్పా ప్యాకేజీ, ప్రత్యామ్నాయ ఉపాధి చూపడం లేదని వాపోతున్నారు.

మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి ఏదీ?

రాంబిల్లి మండలంలో సముద్ర తీర ప్రాంతంలో చేపలు పట్టుకుంటూ వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల ప్రజలు జీవనం సాగించే వారు. ఇప్పుడు నేవల్ బేస్ రాకతో వారికి ఉపాధి పోయింది. ప్రత్యామ్నాయంగా మరోచోట ఉపాధి కల్పిస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గతంలో నేవల్ బేస్ ప్రభావం వల్ల మత్స్యకార గ్రామాల ప్రజలు ఉపాధి కోల్పోయామని ధర్నాలు చేశారు. వారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్యాకేజీలు అందజేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్యకార జీవన భృతి ఇవ్వలేదు. ఉపాధి కల్పించలేదు. దీంతో మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాలే మిగిలాయి..

నేవల్ బేస్ ప్రాజెక్టులో ప్రభావిత గ్రామాలైన కొత్తపేట, కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, పెదకలవాలాపల్లి, వై.లోవ గ్రామాల్లో కొంత మేర భూములు, కొండలు, పంట కాలువలు ఆధారంగా బతుకుతున్నారు. కొండలపై పాకలు వేసుకొని పశువులు మేపుకుంటూ జీడి, కొబ్బరి, తదితర చెట్లు పెంచుకుంటూ జీవనాధారం సాగించేవారు. నేవీ ప్రహరీ నిర్మాణం వల్ల వాటిని కోల్పోయారు. పశుగ్రాసం కొరతతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొండల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టడం వల్ల ప్రకృతి విపత్తుల సమయంలో శారదానది ఉప్పొంగి పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాలు నీట ముంపునకు గురవుతున్నాయి. పొలాలు శారదానది ఆవలి ఉండటం వల్ల పుట్టిల సహాయంతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వేళ నది ఉధృతంగా పెరిగితే ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందేనని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. తాము బతకడానికి వనరులు లేనప్పుడు తమ గ్రామాలను నిర్వాసిత ప్రాంతాలుగా గుర్తించి మరోచోట ఉపాధి చూపాలంటూ 330 రోజులుగా నిరసన దీక్షలు చేపడుతున్నారు. అధికారులు వచ్చి చర్చలు జరిపి వెళ్లిపోతున్నారు తప్పా తమ కష్టాలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి జీవనాధారం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జీవనాధారం కోల్పోయాం



నేవల్ బేస్ రాక ముందు గ్రామ సమీపంలో కొండల మీద పాకలు వేసుకుని పశువులను మేపుకుంటూ పాడి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ సాగేది. ఇప్పుడు ఆకస్మికంగా ప్రహరీ నిర్మాణం చేయడంతో పశుగ్రాసం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో శ్మశానవాటిక స్థలం లేదు. 330 రోజులుగా గ్రామంలో నిరసన దీక్షలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేయడం లేదు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించి ఉపాధి కల్పించాలి.

– పిల్ల లక్ష్మి, పెద కలవలాపల్లి, రాంబిల్లి మండలం

శారదానది ఉప్పొంగితే మా గ్రామాలు ముంపులోనే..



రైవాడ రిజర్వాయర్ నీరు వదిలితే రాంబిల్లి మండలంలో శారదానది ప్రవహిస్తోంది. పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాల పక్క నుంచి సముద్రంలోకి నదీ జలాలు కలుస్తాయి. శారదానదికి తూర్పున వెల్చూరు, సంతపాలెం, రాజకోడూరు, అప్పారాయుడుపాలెం, పంచదార్ల, హరిపురం, భోగాపురం, కొత్తూరు గ్రామాల వరద నీరు శారదానదిలో కలవడం వల్ల పెదకలవలాపల్లి, వై.లోవ గ్రా మాల్లోకి పోటెత్తి ముంపునకు గురవుతున్నాయి. కొండ మీదకు వెళ్లకుండా పంటలు వేసుకోవడానికి వెళ్లకుండా శారదానదిని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేయడం వల్ల పొలాలు నీట ముంపునకు గురవుతున్నాయి.

– రావి దేముళ్లు, పెదకలవలాపల్లి, మాజీ ఎంపీటీసీ

సారా నుంచి విముక్తి కలిగించండి

- ఎస్‌ఐకు సుందరకోట గ్రామస్తుల ఫిర్యాదు
- గ్రామంలో విచ్చలవిడిగా సారా తయారీ, విక్రయాలు
- సంపాదన అంతా తాగుడుకే వెచ్చిస్తున్నారని ఆవేదన

నాతవరం: తమ గ్రామంలో నాటుసారా విచ్చలవిడిగా తయారు చేస్తున్నారని, దానిని నిర్మూలించాలని సుందరకోట గ్రామస్తులు, డ్వాక్రా మహిళలు ఆందోళనకు దిగారు. మంగళవారం నాతవరం పోలీసు స్టేషన్‌కు చేరుకున్న వీరంతా ఎస్‌ఐ భీమరాజుకు ఈమేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు, పీసా కమిటీ కార్యదర్శి బత్తుల కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టరు బండి గంగరాజు, డ్వాక్రా మహిళలు స్టేషన్ బయట విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామంలో సారా తయారు చేయడమే కాకుండా విక్రయించడంతో అధిక సంఖ్యలో సారా తాగుతున్నారన్నారు. ఇప్పటికే చాలామంది మగవారు సారా తాగి మరణించడంతో మహిళలు వితంతువులుగా మారారన్నారు. నిత్యం సారా అందుబాటులో ఉండటం వలన విద్యార్థులు సైతం బానిసలు అవుతున్నారన్నారు. ఇప్పటికే అనేకమంది అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న ప్రజలు సైతం రోజు వారీ తెచ్చుకున్న కూలీ డబ్బులతో సారా తాగేస్తున్నారని, చాలా కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామస్థులు మూకుమ్మడిగా తీర్మానించి సారా తయారీ బట్టీలపై దాడులు చేసి సామగ్రిని పోలీసులకు అప్పగించారన్నారు. అప్పట్లో పోలీసులు గ్రామంలో మీటింగ్ పెట్టి సారా నిర్వాహకులకు హెచ్చరికలు చేయడంతో కొంతకాలంపాటు మానేశారన్నారు. ఇటీవల మళ్లీ సారా తయారీదారులకు అడ్డు అదుపు లేకుండా పోవడంతో విచ్చలవిడిగా సారా తయారీ, విక్రయాలు చేస్తున్నారని ఎస్‌ఐ వద్ద వారు వాపోయారు.

జాతీయ స్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలకు సిద్ధం

- 30 నుంచి జమ్మూ కశ్మీర్‌లో ప్రారంభం



క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు రమణ, సత్యనారాయణ

అనకాపల్లి: జమ్మూ కశ్మీర్‌లో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించే 36వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే 12 మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చామని జిల్లా క్రీడాకారిక సంస్థ అధికారి ఎల్.వి.రమణ, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక గవరపాలెంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల మైదానంలో శిక్షణ ముగింపు కార్యక్రమంలో సోమవారం వారు మాట్లాడారు. టెన్నికాయిట్‌లో గెలుపొందిన క్రీడాకారులు ఇంత వరకూ రూ.39 లక్షల వరకూ క్రీడా ప్రోత్సాహకాలు అందుకున్నారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన ముగ్గురు క్రీడాకారులు క్రీడా కోటాలో తపాలా శాఖలో ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ విభాగాల్లో జాతీయ క్రీడాకారులను ఉదాహరణగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.డి.రామారావు, సీనియనర్ వాలీబాల్ క్రీడాకారులు యల్లపు గోవింద నూకఅప్పారావు, పి.రమణారావు, అసోసియేషన్ శిక్షకుడు జి.రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో బాలికల విభాగంలో..... కె.జ్యోతిక, హెచ్.స్పందన, హెచ్.దీక్షిత(అనంతపురం), ఆర్.సంస్కృతి (పశ్చిమగోదావరి), కె.ఇందు(విజయనగరం), పి.శ్రావణి(శ్రీకాకుళం), బాలుర విభాగంలో ఎస్.గౌతమ్ సంజయ్, జి.మహీధర్(అనంతపురం), ఎస్.సాయికుమార్(విజయనగరం), కె.శివశంకర్, బి.సత్యనారాయణ(తూర్పుగోదావరి), డి.రోహిత్ కుమార్(విశాఖపట్నం) శిక్షణ పొందారు.

జీవాలకు మూడు సార్లు నట్టల నివారణ మందు

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు

అనకాపల్లి: జిల్లాలో జనవరి, ఏప్రిల్, అక్టోబర్ మాసాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి 25 గొర్రెల మేకల షెడ్లు చొప్పున మొదటి విడతగా ఇస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను పెంపకదారులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఛైర్మన్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ వ్యాధులు బారినపడిన గొర్రెలకు, మేకలకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనుబాబు, పశువైద్యాధికారి భానుమూర్తి, యూనియన్ జిల్లా వైస్ ఛైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, మాజీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్లు పినిబోయిన అప్పారావుయాదవ్, బొట్టా వరహాలు గోకాడ దేముడునాయుడు, ముచ్చ రామనాయుడు, పల్ల శ్రీరాములు పాల్గొన్నారు.

'ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన'



బోడపాలెం సభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

కోటవురట్ల: వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు హామీలు నెరవేరుస్తూ ముందుకు అడుగులు వేస్తోందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పి.కె.పల్లిలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను సమర్థవంతంగా పంపిణీ చేశామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని , అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని తెలిపారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, ఆర్డీవో జయరాం, ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పశ్చాత్తాప దీక్ష చేయాలి

- హామీలు నెరవేర్చనందుకు వెంకన్న సాక్షిగా క్షమాపణలు చెప్పాలి
- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం డిమాండ్



నక్కపల్లి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రాయశ్చిత్త దీక్ష కాదని, పశ్చాత్తాప దీక్ష చేపట్టాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ చంద్రబాబు ట్రాప్‌లో పడ్డారన్నారు. తిరుపతి వెంకన్న ప్రసాదం (లడ్డూ)లో జంతువుల కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదన్నారు. ఈ వ్యవహారంలో సీఎం ఒకలా, టీటీడీ ఈవో మరోలా ప్రకటనలు చేస్తున్నారన్నారు. రెండ్నెల్ల క్రితమే బయటపడితే ఇప్పటివరకు ఎందుకు ప్రకటించలేదో ప్రజలంతా తెలుసుకోవాలన్నారు. కేవలం జగన్‌పై రాజకీయంగా బురద జల్లేందుకే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోవడం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, ఉచిత పథకాలను 100 రోజులైన అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. వీటి నుంచి వారి దృష్టిని మరల్చేందుకు తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని చంద్రబాబు తన అస్త్రంగా వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. వందల కోట్ల భక్తుల మనోభావాలు దెబ్బతినేలా రాజకీయం చేస్తున్నారన్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి తప్పు జరగలేదని తిరుమలలో ప్రమాణం చేశారని, చంద్రబాబుకు దమ్ముంటే తన కుటుంబంతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. అబద్ధాల కోరు చంద్రబాబుతో పొత్తుపెట్టుకుని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయించలేని కారణంగా పవన్‌కల్యాణ్ పశ్చాత్తాప దీక్ష చేయాలన్నారు. తిరుపతి వెంకటేశ్వరస్వామిని, ప్రజలను క్షమాపణలను కోరాలన్నారు. టీడీపీతో తెగతెంపులు చేసుకుంటే ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందన్నారు.

తిరుపతి లడ్డూపై దిగజారుడు రాజకీయం

- పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు



రూ.లక్ష చెక్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: ఎంతో పవిత్రమైన తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీశారని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గత నెల 21న అచ్యుతాపురం సెజ్ ఎసైన్షియా కంపెనీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న బోడపాలెం గ్రామానికి చెందిన జీరెడ్డి కాశీనాయుడును మంగళవారం పరామర్శించి వైఎస్సార్ సీపీ తరఫున లక్ష రూపాయల చెక్కు అందజేశారు. అతని ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌ను పక్కనపెట్టి చాలా చేశామంటూ కార్యక్రమం చేయడం విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. వంద రోజుల పాలనలో చేసిందేమీ లేక, అమరావతిలో వరద ముంపు బాధితులకు న్యాయం చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు పన్నిన పన్నాగం అన్నారు. తప్పులను సృష్టించి ఎదుటి వ్యక్తులపైకి నెట్టేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో లేకపోయినా జగన్ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటారన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ సింగంపల్లి ఎరుకునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, సర్పంచులు శివరాం, వరహాలబాబు, పార్టీ నాయకులు బూషణం, పైల నాని, పోతల సత్తిబాబు, లోకవరపు బాబులు, కరెడ్ల సాయి, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభలు



ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తుమ్మపాల : ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహించే అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రథమ మహాసభలు విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు బాలేపల్లి వెంకటరమణ, రాజన దొరబాబు పిలుపునిచ్చారు. ఈమేరకు కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా ఎన్నో విరోచిత ఉద్యమాలు నిర్వహించి , బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. మన దేశంలో పేద వాడికి విద్య అందకుండా జరుగుతున్న ప్రైవేటీకరణకు,కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభలు జరుపుకోవడం చాలా సంతోషమన్నారు. మేధావులు, విద్యార్థులు, ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించి మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్, జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి పాల్గొన్నారు.

రైవాడ.. నిండు కుండ

- నేడో, రేపో స్పిల్వే గేట్ల ద్వారా నీటి విడుదల

దేవరాపల్లి: రైవాడ జలాశయం నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. జలాశయం గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా.. ప్రస్తుతం 113 మీటర్లకు చేరుకుంది. మరో వైపు జలాశయంలోకి 350 క్యూసెక్కుల మేర వర్షపు నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం రాత్రి 2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో బుధవారం ఉదయానికి జలాశయంలోకి ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది. జలాశయం ప్రమాదకర స్థాయి నీటి మట్టం 113.50 మీటర్లకు కేవలం 50 సెంటీమీటర్లు మాత్రం దూరంలో ఉండడంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. మిగిలిన నీటిని స్పిల్వే గేట్ల ద్వారా బుధవారం రాత్రి లేదా గురువారం ఉదయానికి శారదా నదిలోకి నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శారదానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

క్లుప్తంగా

వరిలో ఆకుముడత, పాముపాడ తెగుళ్లు



వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి: వరి పంటలో ఆకుముడత, పాముపాడ తెగుళ్లపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి తెలిపారు. మండలంలో కూండ్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంట వేసి 40 రోజులైనందున గట్ల మీద గడ్డిని శుభ్రం చేసినట్లయితే తెగుళ్లను నివారించుకోవచ్చని సూచించారు. మరో 15 రోజుల్లో చిరుపొట్ట దశకు పంట చేరుకుంటుంద, రైతులు 25 కేజీల యూరియా, 20 కేజీల పొటాషియం ఎకరా పొలంలో వేసుకున్నట్లయితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, మురళి, శాస్త్రవేత్త చంద్రశేఖర్ రావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి బి.రామారావు, ఉద్యానశాఖ నుంచి లావణ్యలతో కలిసి వరి పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందారపు లక్ష్మీ, ఎంపీటీసీ జి.నాగమణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఉత్సవానికి ఏర్పాట్లు



ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన దుర్గమాంబ ఉత్సవం పురస్కరించుకొని విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా స్థానిక సంతబయల వద్ద వీధిలో అమ్మవారి ముఖద్వారం నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలను అలంకరించారు. ఉత్సవానికి ముందస్తుగా వెలిగించిన దీపాలంకరణ ప్రజలను ఆకట్టుకుంటోంది.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 236 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,160	4,950
రెండో రకం	3,460	4,100
మూడోరకం	3,150	3,340

అనకాపల్లి సినిమాలు

గొర్రె పురాణం	:రాజా
ఏఆర్ఎం 3డీ	సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
చిక్లెట్స్	:వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు	:శ్రీసత్య
హైడ్ ఎన్ సీక్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 51 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబీ పాటిజివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

రైతులకు వెన్నుదన్నుగా కియోస్క్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఆలోచించి రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన ఆర్బీకేలు ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వీటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల సహాయంతో విత్తనాలు, ఎరువులు బుక్ చేసుకుంటున్నారు. రైతులు ఎటువంటి వ్యయ ప్రయాసలు లేకుండానే వాటిని సులభంగా పొందుతున్నారు.

- ప్రతి ఆర్బీకేలోనూ కియోస్క్ యంత్రాలు
- విత్తనాలు, ఎరువులు ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం
- రైతులకు తప్పిన వ్యయప్రయాసలు



కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు వ్యవసాయ సమాచారం తెలియజేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

తుమ్మపాల: విత్తనాల నుంచి పంట విక్రయం వరకు దశాబ్దాలుగా అష్టకష్టాలు పడుతున్న రైతుల గమనాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్చేసింది. వ్యవసాయమంటే దండగ కాదు పండుగ అనే విధంగా ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో వ్యవసాయాధికారులను ఉంచింది. రైతు సంక్షేమమే లక్ష్యంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగింది. సాగును సంబరంగా మార్చేందుకు విశేషంగా కృషి చేశారు. అన్నదాతలకు సకల సమాచారం అందించాలనే లక్ష్యంతో కియోస్క్ యంత్రాలను ఆర్బీకేల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. భూసార పరీక్ష నుంచి అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సేవలను పల్లె ముంగిటకే చేర్చారు. కియోస్క్ యంత్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులను ముందస్తుగా బుక్ చేసుకునే వెలుసుబాటు కల్పించారు. పండించిన పంటలను గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు సహకారం అందించారు. గడిచిన ఐదేళ్లలో ఎన్నో రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసే అన్నదాతలు అధిక దిగుబడి సాధించేందుకు సహకారం అందించారు. రైతు భరోసా కేంద్రాల్లో డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. ఏ భూమిలో ఏ పంట సాగు చేయాలి. దానికి సంబంధించిన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు గురించి తెలుసుకోవచ్చు. అలాగే పశువులకు వచ్చే రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు కియోస్క్ యంత్రం ద్వారా తెలుస్తోంది.

● ముందుగానే బుక్ చేసుకోవచ్చు

అనకాపల్లి నియోజకవర్గంలో పట్టణంతోపాటు **రెండు మండలాల్లోను** 43 రైతు భరోసా కేం**ద్రాలు ఉన్నాయి. అనకాపల్లి** మండలంలో 24, **కశింకోట మండలంలో** 19, ఆర్బీకేలు ఉండగా, **43 కియోస్క్ యంత్రాలు** అందుబాటులో **ఉన్నాయి. వీటి ద్వారా** స్థానిక రైతులకు వ్యవసాయ అధికారులు, వీఏఏలు, వీహెచ్ఎలు సమగ్రమైన సమాచారం రైతులకు వివరిస్తున్నారు. విత్తనాలు, ఎరువుల బుకింగ్ ముందుగానే బుక్ చేసుకోవచ్చు.

● తప్పిన దళారుల బెడద

గతంలో రైతులు పండించిన పంటకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడి దళారుల చేతిలో మోసపోయే వారు. కాని ఆ పరిస్థితి లేకుండా కియోస్క్ ద్వారా సమీపంలోని కొనుగోలు కేంద్రాల సమాచారం సులభంగా లభిస్తుంది.

● వాతావరణ సమాచారం..

ఈ యంత్రం ద్వారా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది. రైతు భరోసా కేంద్రాల పరిధిలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దానికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

● విత్తనాలు, ఎరువులు ముందస్తు బుకింగ్...

కియోస్క్ యంత్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, పంటల కొనుగోలు వంటి సమాచారం తెలుసుకోవచ్చు. ఎరువులు, పురుగు మందులను ముందస్తుగా బుకింగ్ చేసుకోవచ్చు.

కియోస్క్‌తో అన్ని రకాల సేవలు లభ్యం

రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. దీని ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థిక ప్రగతి సాధించవచ్చు. గ్రామ స్థాయిలో అన్ని రకాల సేవలు లభించడంతో రైతులు సంతోషంగా ఉంటున్నారు. ఇతర వ్యవసాయ సేవల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలి.

– పి.రంగాచారి, వ్యవసాయాధికారి, అనకాపల్లి మండలం

పరిమితికి మించి ప్రయాణికులతో ప్రమాదం

ఆటోవాలాలకు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ అవగాహన



ఆటోవాలాలతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలో ఆటోవాలాలకు ఆయన అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి, వాహన రికార్డులను వెంట తీసుకుని రావాలి, ఆటోలో అనుమానిత వ్యక్తులు ప్రయాణించినట్లయితే దగ్గరలో పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

కశింకోట: స్థానిక తహసీల్దార్‌గా అడబాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన జి.సత్యనారాయణను పాయకరావుపేట బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖ జిల్లా పద్మనాభం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు.

చురుగ్గా నూకాంబిక ఆలయ నవీకరణ పనులు



ఆలయ మండప ద్వారాల నవీకరణకు చేపట్టిన పనులు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని నవీకరించే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రూ.5 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేస్తున్నారు. దీనిలో భాగంగా గర్భగుడి మండపంలోకి రెండు వైపులా ప్రవేశ ద్వారాలు భక్తుల రాకపోకలకు అనువుగా వెడల్పు చేయనున్నారు. దీనికోసం ప్రస్తుతం ఉన్న ద్వారాలను తొలగించారు. ఆలయ ఉత్తర ప్రవేశ ద్వారం వద్ద షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా నవీకరణ, ఇతర పనులు నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ తెలిపారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

కశింకోట: నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి ఎ.సుబ్రహ్మణ్యేశ్వరి, సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు మంగళవారం తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరం సంఘ వార్షిక నివేదిక, ఆడిట్ నివేదిక, వాస్తవ బడ్జెట్, అంచనా బడ్జెట్ ఆమోదం గురించి, ఇతర అంశాల గురించి చర్చిస్తామన్నారు. సంఘ సభ్యులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

దీపావళికి అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: సూపర్ సిక్స్ హామీలో భాగంగా వచ్చే దీపావళికి అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఏఎస్ పేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి నరసాపురం ఆనకట్ట వరకు గట్టు స్థానంలో తారురోడ్డు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, స్థానిక పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళి, మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల నాయకులు బుదిరెడ్డి చిన్న, కర్రి వెంకటసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి పంటకు ఈ కేవైసీ తప్పనిసరి



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, గ్రామ ప్రతినిధులు, రైతులు

పరవాడ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ వరి పంటకు ఈ–పంట నమోదుతోపాటు ఈకేవైసీ చేయడం ద్వారా ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేస్తుందని పరవాడ మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి అన్నారు. పరవాడ, వెన్నలపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై అందించనున్న డ్రోన్లను అర్హులైన రైతులు తీసుకుని ఎరువులు, పురుగు మందులు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పిచికారీ చేయడం ద్వారా పంట పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పాడి పశువులకు షెడ్ల నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం రాయితీ అందిస్తుందన్నారు. జాతీయ ఉపాధి పథకంలో వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు, పంట పొలాలకు రహదారులు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలుచేసే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలని సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు పైల రామచంద్రారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, వెన్నల సన్యాసిరావు, చుక్క అప్పలనాయుడు, సిరపరపు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 25 మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కశింకోట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జెట్టపురెడ్డితుని గ్రామ సచివాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు 85 మందికి సేవలందించారు. వీరిలో 25 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యురాలు గీతాంజలి, ఆప్తాలమిక్ వరహాలు పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శిబిర కంటి నరాలు, కంటి నీటి కాసులు, చిన్న పిల్లల కంటి చికిత్సల కోసం ఇద్దరేసి, కంటిపై పొర చికిత్సకు ముగ్గురికి ప్రత్యేక వైద్యుల ద్వారా చికిత్స చేయడానికి సిఫార్స్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, శిబిరం సమన్వయకర్తలు సిహెచ్ అశ్వనీకుమార్, వై. పైడిరాజు, నర్సు గిరిజా పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణ చర్యలతో అధిక దిగుబడులు



వరి పొలాలను పరిశీలిస్తున్న సహాయ సంచాలకుడు రామారావు, వ్యవసాయ అధికారులు



రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయ అధికారులు

కశింకోట: వరిలో వచ్చే తెగుళ్లు, పురుగుల నివారణకు సకాలంలో చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకుడు టి.రామారావు అన్నారు. ఏఎస్ పేట, బయ్యవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పొలాలను సందర్శించి రైతులకు పంట ఏపుగా ఎదిగి దిగుబడులు సాధించడానికి సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏడీ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న, సూపర్ వైజింగ్ అధికారి మురళి, వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

- లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశంలో అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

పరవాడ: కార్మికుల భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు ముందుకు రావాలని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలోని ఎంఏఎస్ఆర్ఎం సమావేశ మందిరంలో లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ అచ్యుతాపురంలోని ఎసైన్షియా పరిశ్రమలో జరిగినట్లు ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పూర్తి వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. డిప్యూటి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ మాట్లాడుతూ మాక్ డ్రిల్‌తో పాటు, సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించి వాటి నివేదికల మేరకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పైడి చిన్నారావు మాట్లాడుతూ పరిశ్రమల్లో ముందస్తు తనిఖీలు నిర్వహించి, ఆఫ్‌సైట్, ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌లు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. సిబ్బందికి నైపుణ్య శిక్షణ మెరుగుపరచాలన్నారు. కార్మిక సంక్షేమానికి పరిశ్రమల శాఖ తనిఖీ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఎన్ ఫార్మా కార్యదర్శి జెట్టి సుబ్బారావు, లోకల్ క్రైసిస్ గ్రూప్ సభ్యులు డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ హనుమంత లక్ష్మణరావు, జి.రమేష్‌కుమార్, పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



దిబ్బపాలెంలో అన్నసమారాధనలో పాల్గొన్న నాయకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం గ్రామంలో గణపతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు తొలుత గణపతిని దర్శించుకుని, పూజలు జరిపారు. అనంతరం మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అరిజిల్లి దేవిరవి, మాజీ ఎంపీటీసీ అమ్మోరు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా సమితి(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ నివేదిత, డాక్టర్ రత్నప్రకాష్, డాక్టర్ సత్యనారాయణ, ఎంపీ రామకృష్ణ, కంప్యూటర్ అధ్యాపకులు జె.గణేష్,, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన గవరవరం



విజేతలతో ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అదరగొట్టారు. 100, 200, 800 మీటర్ల పరుగు పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానలను షాట్‌పుట్, లాంగ్ జంప్‌లలోను తమ ప్రతిభను చాటారు. పాఠశాల విద్యార్థి పి.సురేందర్ వంద మీటర్ల పరుగులో తృతీయ, లాంగ్‌జంప్‌లో చతుర్థ స్థానాలను, ఎస్.వెంకటేష్ వంద మీటర్ల పరుగులో ప్రథమ, 400 మీటర్లలో మూడో స్థానాలలో నిలిచాడు. ఎం.హేమసాయి వంద మీటర్ల పరుగులో ద్వితీయ, లాంగ్ జంప్‌లో ప్రథమ, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానాలను పొందగా, పి.సాయిదేవి వంద మీటర్ల పరుగులో తృతీ, షాట్‌పుట్‌లో ప్రథమ, 800 మీటర్లలో ద్వితీయ స్థానాలను పొందారు. ఎస్. మధుశ్రీ 200 మీటర్ల పరుగులో తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె. సుందర్‌సింగ్ మంగళవారం తెలిపారు. వీరంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. సత్తాచాటిన విద్యార్థినీ విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని సహ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక



విద్యార్థులతో పీడీ కొండబాబు, ఉపాధ్యాయులు

రోలుగుంట : బుచ్చింపేట హైస్కూలు నుంచి స్కూల్ గేమ్స్‌లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ కొండబాబు తెలిపారు. రోలుగుంట జెడ్పీ స్కూల్లో ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు కేజీబీవీతో కలిపి మిగిలిన జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఎనిమిదితో కలిపి తొమ్మిది పాఠశాలల నుంచి బుచ్చింపేట హైస్కూల్ విద్యార్థులు పలు ఆటల్లో ప్రతిభ చూపించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారిని హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయులు, పీడీ కొండబాబు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరమణ అభినందించారు.

సబ్బవరం ఎంపీడీవోగా పద్మజ



సబ్బవరం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా పి.పద్మజ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లి, సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఆమె గతంలో పరవాడ ఈవోపీఆర్డీగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమె మీడియాతో మాట్లాడుతూ మండల ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం

చోడవరం రూరల్ : విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలను అలవరచుకోవడం కోసమే జాతీయ సేవా పథకం ఆవిర్భవించిందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలోని మూడు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీవో పాల్గొన్నారు.

కశింకోటలో దంచికొట్టిన వర్షం



కశింకోటలో మంగళవారం రాత్రి వర్షం దంచికొట్టింది. దాంతో రోడ్లపై వర్షపు నీరు చేరింది. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. - కశింకోట